# సాక్షి కామారెడ్డి

శనివారం । 10 । ఆగస్టు । 2024






## మొక్కలను సంరక్షించాలి

జిల్లావ్యాప్తంగా శుక్రవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు, అధికారులు మొక్కలు నాటారు.

- 8లో ▸



## ఆదివాసీ దినోత్సవం

జిల్లాలో శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివాసీ నాయక్‌పోడ్ జెండాలను ఆవిష్కరించారు.

- 9లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
34.5 /22.6

## వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

## న్యూస్‌రీల్

### నాగిరెడ్డిపేటలో మరో రెండు జీపీలు

**నాగిరెడ్డిపేట:** మండలంలో కొత్తగా రెండు పంచాయతీలు ఏర్పాటయ్యాయని ఎంపీడీవో ప్రభాకరచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆత్మకూర్ గ్రామ పంచాయతీలోని చిన్నఆత్మకూర్ గ్రామాన్ని, ధర్మారెడ్డి పంచాయతీ పరిధిలోని కన్నారెడ్డి గ్రామాన్ని నూతన పంచాయతీలుగా ఏర్పాటు చేశారని పేర్కొన్నారు.

**గాంధారి మండలంలో..**

**గాంధారి:** పిస్కిల్‌గుట్ట తండా కొత్త పంచాయతీగా ఏర్పాటయ్యిందని ఎంపీడీవో రాజేశ్వర్ తెలిపారు. ఇప్పటి వరకు తిమ్మాపూర్ పంచాయతీ పరిధిలో ఉన్న తండాను పంచాయతీగా ఏర్పాటు చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదలయ్యిందని పేర్కొన్నారు.

### రేపు సివిల్స్ ఉచిత శిక్షణ ప్రవేశ పరీక్ష

**కామారెడ్డి అర్బన్:** సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్-2025 పరీక్షలకు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకున్నవారికి ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. అభ్యర్థులు హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఎస్సీ సంక్షేమశాఖ జిల్లా అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. హాల్ టికెట్‌లో పేర్కొన్న ప్రకారం పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

### 'మానసిక స్థైర్యం నింపాలి'



**కామారెడ్డి టౌన్:** దివ్యాంగులకు పౌరులందరూ చేయూతనిచ్చి వారిలో మానసిక స్థైర్యం నింపాలని డీఈవో రాజు కోరారు. కామారెడ్డిలోని జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం సమగ్ర శిక్ష అభియాన్, భారత కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థల ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఉపకరణాల గుర్తింపు శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 34 మంది వినికిడి లోపం, 13 మంది దృష్టి లోపం, 76 మంది మానసిక వైకల్యం, 104 మంది శారీరక వైకల్యంతో ఉన్నట్లు శిబిరంలో నమోదు చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో సహిత విద్య సమన్వయకర్త కృష్ణ చైతన్య, గుణాత్మక విద్య సమన్వయకర్త వేణుగోపాల్, ఎంఈవో ఎల్లయ్య, హెచ్‌ఎం నరహరి రాజు పాల్గొన్నారు.

### 'ఆకతాయిలతో కఠినంగా వ్యవహరించాలి'



**కామారెడ్డి క్రైం:** ఆకతాయిల విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ సింధు శర్మ సూచించారు. శుక్రవారం ఆమె పట్టణ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి కేసుల పురోగతిని తెలుసుకున్నారు. రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలని, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. బ్లూ కోల్ట్, పెట్రోలింగ్ వాహనాలతో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ పార్క్‌ను ఎస్పీ ప్రారంభించారు. స్కూల్ పిల్లలకు నోటు పుస్తకాలు, పెన్నులు బహూకరించారు. చిల్డ్రన్స్ పార్క్ ఏర్పాటు చేసిన పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ నరసింహారెడ్డి, డీఎస్పీ నాగేశ్వర్ రావు, ఎస్‌బీ సీఐ జార్జ్, సీసీఎస్ సీఐ శ్రీనివాస్, టాస్క్‌ఫోర్స్ సీఐ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

# నిషేధం గుట్కాయ స్వాహా!

- రాష్ట్ర రాజధానితోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి జిల్లాకు రవాణా
- జిల్లాలో యథేచ్ఛగా విక్రయాలు
- అప్పుడప్పుడు దాడులతో సరిపెడుతున్న పోలీసులు



**సాక్షి ప్రతినిధి, కామారెడ్డి:** పొగాకుతో తయారు చేసిన గుట్కా, పాన్ మసాలా, ఖైనీల విక్రయాలపై ప్రభుత్వం నిషేధం విధించింది. అయితే ఒకసారి ఆయా ఉత్పత్తులకు అలవాటు పడిన వారు మానే పరిస్థితి ఉండదు. దీంతో వీరి బలహీనతను సొమ్ము చేసుకుంటూ గుట్కా విక్రేతలు అక్రమ దందాను కొనసాగిస్తున్నారు.

**జిల్లా కేంద్రంలో అడ్డాలు..**

జిల్లా కేంద్రమైన కామారెడ్డి పట్టణం కేంద్రంగా గుట్కా దందా భారీ ఎత్తున నడుస్తున్నా అధికారులు అసలు మూలాల్లోకి వెళ్లడం లేదు. హైదరాబాద్‌తోపాటు మహారాష్ట్ర, కర్ణాటకల నుంచి జిల్లాకేంద్రానికి దిగుమతి అవుతోంది. గుట్కాసురులు భారీ ఎత్తున గుట్కాను దిగుమతి చేసుకు, ఇళ్లలో, సొంత గోదాముల్లో నిల్వ చేసుకుంటున్నారు. పగటిపూటనే గుట్కా ప్యాకెట్ల బస్తాలను తీసుకువచ్చి ఇళ్లల్లో నిల్వ చేస్తున్నారు. అనంతరం గోప్యంగా బైక్‌లపై కామారెడ్డితోపాటు ఇతర పట్టణాలు, మండలాలు, గ్రామీణ ప్రాంతాలలోని పాన్ షాప్‌లు, కిరాణా దుకాణాలకు చేరవేస్తున్నారు. తమను ఎవరైనా అనుసరిస్తున్నారేమోనని దారులు మార్చి మరీ గుట్కా బస్తాలను తీసుకువెళ్లి వ్యాపారులకు అందిస్తున్నారు. ఎక్కువగా హైదరాబాద్ నుంచి 44వ నంబరు జాతీయ రహదారి మీదుగా వ్యాన్లతో జిల్లా కేంద్రానికి గుట్కా బస్తాలు వస్తున్నట్టు తెలుస్తోంది. అలాగే జిల్లాకు పొరుగునే ఉన్న మహారాష్ట్ర, కర్ణాటకల నుంచి పెద్ద మొత్తంలో గుట్కా తరలివస్తోంది. జాతీయ రహదారులతో పాటు రాష్ట్రీయ రహదారులపైనా పెద్దగా తనిఖీలు లేకపోవడంతో గుట్కా మాఫియా సులువుగా తరలించి సొమ్ము చేసుకుంటోంది.

**ప్రభుత్వం గుట్కాపై నిషేధం విధించినా..**

విక్రయాలు ఆగడం లేదు. పాన్‌షాపులు, కిరాణా దుకాణాలలో యథేచ్ఛగా అమ్మకాలు సాగుతూనే ఉన్నాయి. పోలీసులు అప్పుడప్పుడు దాడులతో సరిపెడుతుండడంతో అక్రమ దందాకు అడ్డుకట్ట పడడం లేదు.

**మూలాల్లోకి వెళ్లని పోలీసులు..**

పోలీసులు అప్పుడప్పుడు దుకాణాలలో దాడులు నిర్వహిస్తూ గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని దహనం చేస్తున్నారు. అయితే వారికి గుట్కా ఎక్కడి నుంచి వస్తోందన్న విషయమై కూపీ లాగడం లేదు. దీంతో సాధారణ దుకాణాదారులు మాత్రమే కేసులు, జరిమానాల పాలవుతున్నారు. అసలు సూత్రధారులు దర్జాగా తప్పించుకుంటూ అక్రమ దందా కొనసాగిస్తున్నారు. రూ. కోట్ల దందా చేస్తున్న వారిని బయటకు లాగితే గానీ అమ్మకాలు నిలిచిపోయే పరిస్థితి ఉండదు. పోలీసులు పకడ్బందీ వ్యూహంతో కదిలితేగానీ గుట్కా మాఫియాకు అడ్డుకట్ట పడదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**తనిఖీలు చేస్తున్నాం..**



నిషేధిత గుట్కా ఉత్పత్తుల విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. గుట్కా ఉత్పత్తులు అమ్మినా, నిల్వ చేసినా నేరమే.. అక్రమ అమ్మకాలను అడ్డుకోవడానికి దుకాణాల్లో తనిఖీలు చేపడుతున్నాం. ఎక్కడైనా గుట్కా విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారమిస్తే విక్రయదారులపై చర్యలు తీ సుకుంటాం.

– చంద్రశేఖర్‌రెడ్డి, పట్టణ ఎస్‌హెచ్‌వో, కామారెడ్డి

## 'హర్ ఘర్ తిరంగా' విజయవంతం చేయాలి



జాతీయ జెండాలతో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, పార్టీ నేతలు

**కామారెడ్డి టౌన్:** స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టబోయే హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం నుంచి 14 వ తేదీ వరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు ఉంటాయన్నారు. పంద్రాగస్టున ప్రతి ఇంటిపైన జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని ప్రజలను కోరారు. బీజేవైఎం ఆధ్వర్యంలో అన్ని మండలాలు, పట్టణాలు, గ్రామాల్లో బైక్‌ర్యాలీలు నిర్వహించాలని సూచించారు.

కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, ప్రధాన కార్యదర్శులు నరేందర్‌రెడ్డి, రవీందర్‌రావు, అసెంబ్లీ కన్వీనర్‌లు లక్ష్మారెడ్డి, లింగారావు, శ్రీనివాస్, నరేందర్, నాయకులు ఆనంద్ రావు, బాల్‌రాజు, చారి, రాజు, రవీందర్, రాజు, వేణు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## హాకీ జిల్లా జట్టు ఎంపిక

**కామారెడ్డి అర్బన్:** హైదరాబాద్‌లోని గచ్చిబౌలి హాకీ మైదానంలో ఆదివారం నిర్వహించే రాష్ట్రస్థాయి హాకీ జూనియర్ మెన్ టోర్నీకి జిల్లా జట్టును ఎంపిక చేశారు. శుక్రవారం గర్గుల్‌లోని ఉన్నత పాఠశాల మైదానంలో ఎంపిక పోటీలు సాగాయి. 50 మంది క్రీడాకారులు పాల్గొనగా.. ప్రతిభ చూపిన 14 మందిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఈ విషయాన్ని హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కోశాధికారులు నీలం లింగం, నోముల మధుసూదన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో గర్గుల్ ఉన్నత పాఠశాల హెడ్‌మాస్టర్ బ్రహ్మం, హాకీ కోచ్‌లు సృజన, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

**జట్టు వివరాలు :** కె.విజయ్‌కుమార్, కె.సుశాంత్, జె.దినేశ్, ఎస్.రోహిత్‌కుమార్, ఎన్.గౌతం, బి.రాంసింగ్, బి.శ్రీకాంత్, బి.ప్రేం సింగ్, బి.శ్రీకర్, ఆదిల్, కృష్ణ, అభిగౌడ్, స్టీవెన్, తులసీకుమార్.



# పన్ను చెల్లించకపోతే జరిమానా తప్పదు

- మరింత విస్తృతంగా తనిఖీలు చేస్తాం
- 'సాక్షి'తో జిల్లా రవాణాధికారి శ్రీనివాస్‌రెడ్డి



**సాక్షి ప్రతినిధి, కామారెడ్డి:** మోటారు వాహనాలకు సంబంధించిన పన్నులను ఎప్పటికప్పుడు చెల్లించకపోతే జరిమానాలు తప్పవని జిల్లా రవాణాధికారి కె.శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. జిల్లాలో ట్యాక్సీ ప్లేట్ వాహనాలు 14,984 ఉండగా.. 8,550 వాహనాలకు సంబంధించిన ట్యాక్స్‌లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రతి మూడు నెలలకోసారి ఆయా వాహనాలకు సంబంధించిన పన్నులు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

జిల్లాలో అత్యధికంగా కామారెడ్డిలో 1,315 ట్యాక్సీ వాహనాలకు సంబంధించిన ట్యాక్స్ పెండింగ్‌లో ఉందన్నారు. మాచారెడ్డి మండలంలో 840 వాహనాలు, గాంధారిలో 665, నిజాంసాగర్‌లో, లింగంపేటలో 497, బాన్సువాడలో 476, బిచ్కుందలో 408, బీర్కూర్‌లో 408, మద్నూర్‌లో 347, సదాశివనగర్‌లో 369, ఎల్లారెడ్డిలో 351, పిట్లంలో 314, దోమకొండలో 373, భిక్కనూరులో 386, జుక్కల్‌లో 256, నాగిరెడ్డిపేటలో 267, తాడ్వాయిలో 335, రామారెడ్డిలో 192, బీబీపేటలో 132, రాజంపేటలో 112 ట్యాక్సీ వాహనాలకు సంబంధించిన ట్యాక్స్ పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు. తనిఖీల సందర్భంగా పెండింగ్ జరిమానాలు ఉన్నట్లు తేలితే అదనంగా మూడు నెలల ట్యాక్స్ జరిమానా పడుతుందన్న విషయాన్ని వాహనదారులు గుర్తుంచుకోవాలన్నారు. వాహనదారులు వెంటనే పెండింగ్ పన్నులను చెల్లించి జరిమానాలనుంచి దూరంగా ఉండాలని సూచించారు.



## బుట్టలోన పాము.. పూజలందుకొనగ..

జిల్లాలో శుక్రవారం నాగుల పంచమిని ఘనంగా జరుపుకున్నారు. భక్తులు ఉదయాన్నే ఆలయాలు, పుట్టల వద్దకు వెళ్లి నాగదేవతకు పూజలు చేశారు. పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆచారం ప్రకారం అక్కాచెల్లెళ్లు పుట్టలో పాలు పోసిన అనంతరం అన్నదమ్ముల కళ్లను పాలతో కడిగి దీవించారు. కాగా పాములు పట్టేవారు బుట్టలో పామును తెచ్చి జిల్లా కేంద్రంలోని వీక్లీ మార్కెట్ ఆవరణలోగల మత్తడి పోచమ్మ ఆలయం వద్ద ఉంచగా.. భక్తులు ఆ పాముకు పూజలు చేసి పాలు పోశారు.

– కామారెడ్డి టౌన్

# ఎరకు చిక్కింది చిన్న చేపే..!



సోదాలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు, వెనకాల సోఫాలో నిందితుడు నరేందర్

- 'సొర' దొరకాల్సి ఉంది
- అవినీతిమయంగా నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
- తాజాగా రెవెన్యూ ఇన్‌చార్జి అధికారి నరేందర్ ఇళ్లపై ఏసీబీ దాడులు
- రూ.6.7 కోట్ల విలువైన నగదు, ఆస్తులు స్వాధీనం
- అవినీతి, అక్రమాలపై 'సాక్షి'లో గతంలో వరుస కథనాలు



ఏసీబీ స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

**సాక్షి ప్రతినిధి, నిజామాబాద్:** నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అవినీతి, అక్రమాలకు హద్దు లేకుండా పోయింది. తాజాగా సూపరింటెండెంట్, ఇన్‌చార్జి రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న దాసరి నరేందర్ ఇళ్లలో హైదరాబాద్ నుంచి వచ్చిన ఏసీబీ అధికారుల బృందం సోదాలు చేసింది. ఈ తనిఖీల్లో విస్తుపోయే రీతిలో నగదు, బంగారం, ఆస్తులు లభ్యమయ్యాయి. నరేందర్ ఇంట్లో ఏకంగా రూ. 6,07,81,000 విలువైన నగదు, ఆస్తుల పత్రాలను అవినీతి నిరోధక శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నరేందర్ ఇంట్లో రూ.2,93,81,000 నగదు, అతని భార్య, తల్లి బ్యాంకు ఖాతాల్లో రూ.1.10 కోట్ల నిల్వలున్న పాస్‌బుక్‌లు, 51 తులాల బంగారం, రూ.1.98 కోట్ల విలువైన స్థిరాస్తి పత్రాలు లభించాయి. ఈ నేపథ్యంలో ఇందూరు నగరంలో ఈ విషయమై అనేక రకాల చర్చలు జరుగుతున్నాయి. ప్రస్తుతం మున్సిపల్ కార్పొరేషన్‌లోని అవినీతి అక్రమ వ్యవహారాల్లో ఏసీబీ ఎరకు కేవలం చిన్న చేప మాత్రమే దొరికిందని, అసలైన సొర చేప చిక్కాల్సి ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

**'సాక్షి'లో వరుస కథనాలు**

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అవినీతి, అక్రమ వ్యవహారాలపై, అస్తవ్యస్త పాలనపై, ప్రభుత్వ ఫీజులకు గండి కొట్టే తీరుపై , ఒక్క ఐడీపై అనేక దరఖాస్తులు, దరఖాస్తుదారులతో దొంగాటలు టీఎస్ బీపాస్‌లో అవకతవకలపై వరుస కథనాలు 'సాక్షి'లో ప్రచురితమయ్యాయి. ఈ కథనాలను పలువురు గుర్తు చేసుకుంటున్నారు. ఇక కార్పొరేషన్‌లోని అవినీతి, అక్రమాలలో పరాకాష్ఠకు చేరిన పెద్ద తిమింగలాన్ని సైతం పట్టుకోవాలని డిమాండ్లు వస్తున్నాయి. నరేందర్‌ను అడ్డం పెట్టుకుని ఒక కీలక అధికారి విచ్చలవిడిగా దండుకున్నట్లు పలువురు చెబుతున్నారు. ఈ క్రమంలో నరేందర్ సైతం విచ్చలవిడిగా అక్రమ వసూళ్లు చేశాడు. నరేందర్ అక్రమాస్తులే ఈ స్థాయిలో ఉంటే సదరు పెద్ద తిమింగలం ఆస్తులు ఏ స్థాయిలో ఉన్నాయో అని మాట్లాడుకుంటున్నారు. ఫైళ్ల కదలికకు సంబంధించి అంతా ఓటీపీ మాయాజాలం అంటూ చర్చోపచర్చలు జరుగుతున్నాయి. బిల్డింగ్ పర్మిషన్స్ నుంచి మ్యుటేషన్ల వరకు అన్నింటా భారీగా వసూళ్లే లక్ష్యంగా మున్సిపల్ కార్పొరేషన్‌ను దోపిడీకి అడ్డాగా మార్చినట్లు బహిరంగంగానే ఆరోపణలు వస్తున్నాయి. నరేందర్ విషయానికి వస్తే బినామీలను ఏర్పాటు చేసుకుని ఆస్తులు కూడబెట్టినట్లు సమాచారం. ఇద్దరు డాక్యుమెంట్ రైటర్లను, మరో ఇద్దరు ప్రైవేటు బిల్డింగ్ ప్లానర్స్‌ను, ఒక ప్రైవేటు డ్రైవర్‌ను ఏర్పాటు చేసుకుని వసూళ్ల దందాకు పాల్పడినట్లు తెలుస్తోంది. పైగా నగరంలో ఒక మెడికల్ ఏజెన్సీ, నాలుగు ప్రైవేటు ఆస్పత్రుల్లో వాటాలు ఉన్నట్లు పలువురు చెబుతున్నారు. బినామీల పేరిట అనేక ఆస్తులు పెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్నప్పటి నుంచి ఇతనిపై గుర్రుగా ఉన్న కాంగ్రెస్ నాయకులు కొందరు నరేందర్ వ్యవహారాలపై నిఘా పెట్టి ప్రభుత్వానికి ఫిర్యాదులు చేసినట్లు వార్తలు వస్తున్నాయి. సుదీర్ఘకాలంగా ఏళ్లతరబడి ఇక్కడే పనిచేస్తున్న నరేందర్‌కు సంబంధించిన ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా శోధించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పూర్తి స్థాయిలో విచారణ చేయాలని, అదేవిధంగా బడా తిమింగలాన్ని సైతం చేజిక్కించుకోవాలని నగర ప్రజలు అంటున్నారు.

# డీసీఎంఎస్‌ను బలోపేతం చేయాలి

- నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి
- డీసీఎంఎస్ చైర్మన్‌గా తారాచంద్ బాధ్యతల స్వీకరణ



ఐడీసీఎంఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న తారాచంద్, పక్కన రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

**సుభాష్‌నగర్(నిజామాబాద్ అర్బన్) :** ఇందూరు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (ఐడీసీఎంఎస్) కార్యకలాపాలను చైర్మన్ తారాచంద్ నాయక్ విస్తృతపర్చి మరింత బలోపేతం చేస్తారనే విశ్వాసముందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం నగరంలోని ఐడీసీఎంఎస్ కార్యాలయంలో చైర్మన్ తారాచంద్ నాయక్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం చైర్మన్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ డీసీఎంఎస్ చైర్మన్ పదవి నిజామాబాద్ రూరల్ ప్రాంతానికి రావడం సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ మాట్లాడుతూ.. రైతులకు అందుబాటులో ఉంటానన్నారు. తనకు పదవి ఇప్పించిన ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్‌తోపాటు ప్రతిఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. రైతులకు ఎరువులు, రుణాలు, విత్తనాలు సకాలంలో అందించేలా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు మానాల మోహన్‌రెడ్డి, తాహెర్ బీన్ హందాన్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కేశ వేణు, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, నాయకులు భూమారెడ్డి, బాగారెడ్డి, ముప్ప గంగారెడ్డి, శేఖర్‌గౌడ్, కెతావత్ యాదగిరి, ఎల్లయ్య, పోలసాని శ్రీనివాస్, గంగాధర్, అంబర్ సింగ్ పాల్గొన్నారు.

# దోమకొండ సీహెచ్‌సీ అప్‌గ్రేడ్!

- వంద పడకల ఆస్పత్రిగా మార్చేందుకు చర్యలు
- రూ. 45.50 కోట్లతో భవన నిర్మాణానికి ప్రతిపాదనలు
- త్వరలో ప్రకటన వెలువడే అవకాశం



దోమకొండ సీహెచ్‌సీ

**కామారెడ్డి టౌన్:** దోమకొండ మండల కేంద్రంలో ఉన్న 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ) త్వరలో 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ కానుంది. దీనికి సంబంధించి త్వరలోనే అధికారంగా ప్రకటన వెలువడే అవకాశాలున్నాయి. దోమకొండ సీహెచ్‌సీని వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తామని ఎన్నికల సమయంలో షబ్బీర్ అలీ హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆయన ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. ఈ అంశంపై ఇటీవల వైద్యశాఖ మంత్రితోనూ చర్చించారు. ఈ అంశంపై జిల్లా పరిషత్‌లోనూ గతంలో తీర్మానం చేయగా.. ఆస్పత్రి భవన నిర్మాణం కోసం దోమకొండ పంచాయతీ నాలుగు ఎకరాల స్థలాన్ని కేటాయించింది. దోమకొండ ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేయాలని స్థానిక ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి సైతం ప్రభుత్వాన్ని కోరారు.

ఈ నేపథ్యంలో తెలంగాణ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీజీఎంఎస్ఐడీసీ) దోమకొండలో వంద ఆస్పత్రి ఏర్పాటు, భవన నిర్మాణం కోసం రూ. 45.50 కోట్లతో శుక్రవారం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. వంద పడకల భవనంతోపాటు మార్చురి, కిచెన్, ల్యాండ్రీ బ్లాక్, అంబులెన్స్ గ్యారేజ్, డీజీ రూం, బయోవేస్ట్ రూం, సెప్టిక్ ట్యాంక్, కాంపౌండ్ వాల్, మెడికల్ గ్యాస్ పైప్‌లైన్, ఫైర్ ఫిట్టింగ్ సిస్టం, వాటర్ సప్లయ్, సానిటేషన్ ఏర్పాట్లు తదితర పనులకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించింది ఈ నేపథ్యంలో త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేస్తే దోమకొండతో పాటు సమీపంలోని బీబీపేట, భిక్కనూరు మండలాలు, సిద్దిపేట జిల్లాలోని దుబ్బాక ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి.

## క్లుప్తంగా

### బిల్లులు ఇప్పించి ఆదుకోండి



భిక్కనూరు : సర్పంచ్‌లుగా తామ పదవీకాలంలో గ్రామాల అభివృద్ధి కోసం అప్పులు చేసి పనులు చేశామని తమకు బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నామని వెంటనే బిల్లులు వచ్చేలా చూడాలని మండల సర్పంచ్‌లు శుక్రవారం పంచాయత్‌రాజ్‌శాఖ ప్రత్యేక కార్యదర్శి షఫీవుల్లాకు వినతి పత్రం అందజేశారు. ఆయనను కలిసిన వారిలో మాజీ సర్పంచ్‌లు తున్కి వేణు, పోతి రెడ్డి, రమేశ్ రెడ్డి, నర్సింలు యాదవ్ తదితరులున్నారు.

### మానాలకు సన్మానం



కామారెడ్డి అర్బన్ : రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి కామారెడ్డికి వచ్చిన సందర్భంగా శుక్రవారం డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు మర్యాద పూర్వకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రాసేనారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనే శ్రీనివాస్, కౌన్సిలర్ చాట్ల రాజేశ్వర్, కాంగ్రెస్ బీబీపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఎల్‌ఐసీ ఏజెన్సీ వృత్తితో మంచి భవిష్యత్తు



కామారెడ్డి అర్బన్ : ఎల్‌ఐసీలో నిరుద్యోగ యువత ఏజెన్సీ తీసుకోవడం ద్వారా స్వయం ఉపాధి పొందవచ్చని ఎల్‌ఐసీ కామారెడ్డి శాఖ మేనేజర్ కృష్ణ మోహన్ అన్నారు. శుక్రవారం కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వద్ద ఎల్ఐసీ చీఫ్ లైఫ్ ఇన్సురెన్స్ ఏజెంట్స్ అసోసియేషన్ (క్లియా) ఆధ్వర్యంలో ఏజెన్సీ జాబ్‌మేళా నిర్వహించారు. జాబ్‌మేళాలో ఏబీఎం హిమాన్షి చౌహన్, క్లియా అధ్యక్షుడు వి.రాజారెడ్డి తదితరులున్నారు.



జిల్లా కేంద్రంలోని 5వ వార్డులో మొక్కకు నీరు పోస్తున్న చైర్‌పర్సన్ ఇందుప్రియ



రామారెడ్డి కస్తూర్బా గాంధీ వసతి గృహంలో..



తాడ్వాయిలోని కాళోజీవాడిలో కుండీల్లో నిలువ ఉన్న నీటిని తొలగిస్తున్న అధికారులు



గాంధారిలోని ఎల్లమ్మ గుడి ఆవరణలో..



నాగిరెడ్డిపేటలోని చీనూర్ పాఠశాలలో..



లింగంపేటలో పారిశుధ్య పనుల పరిశీలన

# నాటిన ప్రతిమొక్కనూ సంరక్షించాలి

ప్రతిఒక్కరూ ఉత్సాహంగా మొక్కలు నాటాలని, నాటిన ప్రతిమొక్కనూ సంరక్షించాలని వక్తలు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమం శుక్రవారం ముగిసింది. పట్టణాల్లో, గ్రామాల్లో అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా మొక్కలు నాటారు. పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు.

– సాక్షి నెట్‌వర్క్



అటవీశాఖ కార్యాలయంలో మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



భిక్కనూరులో మాట్లాడుతున్న పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి షఫీవుల్లా



కామారెడ్డిలో అటవీశాఖాధికారి నిఖిత ఆధ్వర్యంలో..



బీబీపేటలో పిచ్చిమొక్కలను తొలగిస్తున్న సిబ్బంది



రాజంపేటలోని తలమడ్ల పాఠశాలలో..



పెద్ద ఎక్లార గేట్ వద్ద గురుకుల పాఠశాలలో..



పిట్లం బాలికల పాఠశాలలో..



నిజాంసాగర్‌లోని బంజపల్లిలో..



బిచ్కుందలో మొక్కలు నాటిన జెడ్పీ సీఈవో



లింగాపూర్‌లోని పాఠశాల ఆవరణలో..

## ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలి

పిట్లం(జుక్కల్): బాన్సువాడ డిపో ఆర్టీసీ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని బాన్సువాడ డిపో మేనేజర్ సరితా దేవి పేర్కొన్నారు. ఆమె శుక్రవారం పిట్లం మండల కేంద్రంలోని ఫంక్షన్‌హాల్ యజమానులతో మాట్లాడి శుభ కార్యాలకు ఆర్టీసీ ఇస్తున్న రాయితిని వాటి వివరాలను వెల్లడించారు. వివరాల పట్టికను ఫంక్షన్ హాల్ యజమానులకు అందజేశారు. ఆర్టీసీ బస్సులకు 200కి.మీ మేర ఒక సభ్యునికి పల్లె వెలుగు బస్సుల్లో రూ. 63 వసూలు చేస్తామని, ఎక్స్‌ప్రెస్ బస్సులకు 200 కి.మీ ఒక్కొక్కరికి రూ. 64 చొప్పన చెల్లించాల్సి ఉంటుందన్నారు. 10 శాతం రాయితీతో ఇప్పుడు ఆర్టీసీ బస్సులను అందిస్తున్నామన్నారు.



పట్టికను అందజేస్తున్న డిపో మేనేజర్ సరితాదేవి

ఈ కార్యక్రమంలో పిట్లం బస్ స్టేషన్ కంట్రోలర్ సాయన్న, కండక్టర్ గంగాధర్, వినోద్, ఆర్టీసీ సిబ్బంది, ఫంక్షనల్ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

### గర్గుల్‌లో సొసైటీ మడిగెలు వేలం



కామారెడ్డి రూరల్ : కామారెడ్డి పీఏసీఎస్ పరిధిలోని గర్గుల్ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వాణిజ్య సముదాయ మడిగెలకు శుక్రవారం వేలం వేశారు. మొత్తం ఐదు మడిగెలకు గాను మూడు మడిగెలకు టెండర్లు వేశారు. ఇంకా రెండు మడిగెలకు మరోసారి తీర్మానం చేస్తామని సింగిల్ విండో చైర్మన్ పాత లక్ష్మణ్ తెలిపారు. ఈ వేలం కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ బొంబోతుల శంకర్ గౌడ్, డైరెక్టర్లు, సొసైటీ సీఈవో మోహన్ రావు తదితరులున్నారు.

### పంచాయతీ కార్యదర్శిని మార్చాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : పంచాయతీ కార్యదర్శిని మార్చాలంటూ మండలంలోని లింగంపల్లి గ్రామస్తులు ఎంపీడీవోకు వినతి పత్రాన్ని అందజేశారు. మండలంలోని లింగంపల్లిలో గ్రామస్తులు శుక్రవారం ఎంపీడీవో కార్యాలయానికి చేరుకుని ఎంపీడీవో లక్ష్మీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. జీపీ కార్యదర్శి రాజేందర్ పంచాయతీకే రావట్లేదని, ఫోన్ చేస్తే స్పందించడం లేదన్నారు. అభివృద్ధి పనులకు సహకరించట్లేదన్నారు. ఈ కార్యక్రమంలో లింగంపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

## వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

- ఆత్మహత్య చేసుకున్న రాజేశ్ అంత్యక్రియల్లో నిరసన



రాజేశ్ (ఫైల్)

జుక్రాన్‌పల్లి: అక్రమ వడ్డీ వసూలు చేస్తూ రైతుల ఆత్మహత్యకు కారణమవుతున్న వ్యాపారులపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని అర్గుల్‌కు చెందిన కుంట రాజేశ్(45)అనే రైతు అప్పుల బాధతో ఉరేసుకొని గురువారం ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. కాగా శుక్రవారం నిర్వహించిన అంత్యక్రియల్లో పీడీఎస్‌యూ నాయకులు పాల్గొని నిరసన తెలిపారు. మృతుడు రాజేశ్‌కు వడ్డీ వ్యాపారులు నిత్యం ఫోన్ చేస్తూ నగదు కట్టాలని లేకుంటే ఇంటికి



అంతిమయాత్రలో నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు

వచ్చి గొడవ చేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారని, కొంత సమయం కావాలని అతను కోరినా వారు వినకపోవడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. చివరికి పోలీసుల బందోబస్తు మధ్య రాజేశ్ అంత్యక్రియలు జరిగాయి. మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

## నేడు, రేపు వీహెచ్‌పీ రాష్ట్ర సమావేశాలు

కామారెడ్డి అర్బన్ : విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర సమావేశాలు ఈనెల 10,11 తేదీల్లో కామారెడ్డి శ్రీ సరస్వతీ విద్యా మందిర్ హైస్కూల్ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు వీహెచ్‌పీ నగర అధ్యక్షుడు వి వెంకటస్వామి తెలిపారు. సమావేశాలకు వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్, గోసేవ, మాతృశక్తి, దుర్గావాహిని జాతీయ, రాష్ట్ర స్థాయి ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు.

### సీనియర్ సిటిజన్లకు క్రీడలు



కామారెడ్డి అర్బన్ : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం సాయంత్రం సీనియర్ సిటిజన్స్ ఫోరం జిల్లా భవనంలో వివిధ క్రీడలు నిర్వహించారు. క్యారమ్స్ డబుల్, సింగిల్, రమ్మీరబ్, చదరంగం, షటిల్ సింగిల్స్, డబుల్స్, యోగా, నడక, పాటల పోటీలు నిర్వహించారు. పోటీలు శనివారం కొనసాగుతాయని ఫోరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పున్న రాజేశ్వర్, ఎం రాజన్న తెలిపారు. వివిధ క్రీడల ఇన్‌చార్జీలు పీవీ నరసింహం, రాంకిషన్, జైహింద్‌గౌడ్ తదితరులున్నారు.

# 40 మంది ఎస్సైల బదిలీ

ఖలీల్‌వాడి: శాసనసభ ఎన్నికల సందర్భంగా లాంగ్‌స్టాండింగ్‌లో ఉన్న ఎస్సైల బదిలీలు ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు చేపట్టారు. ఎన్నికల తర్వాత బదిలీలు జరుగుతాయని భావించినా ఎంపీ ఎన్నికల నేపథ్యంలో బ్రేక్ పడింది. శుక్రవారం బాసర జోన్ పరిధిలోని నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో 40 మంది ఎస్సైల బదిలీలు జరిగాయి. నిజామాబాద్ రెండో టౌన్ ఎస్సైగా ఎండీ యాసిర్ అరాఫత్, సిరికొండ ఎస్సైగా ఎల్ రామ్, నిజామాబాద్ సీసీఎస్ ఎస్సైగా రమేశ్, నిజామాబాద్ నాలుగో టౌన్ ఎస్సైగా శ్రీకాంత్, ట్రాఫిక్ ఎస్సై–1గా సంజీవ్, ఐదో టౌన్ ఎస్సైగా వెంకట్రావు, మోపాల్ ఎస్సైగా యాదగిరి, నవీపేట్ ఎస్సైగా వినయ్‌కుమార్, వేల్పూర్ ఎస్సైగా నాగనాథ్, బోధన్ రూరల్ ఎస్సైగా రాజశేఖర్, కమ్మర్‌పల్లి ఎస్సైగా అనిల్‌రెడ్డి, నందిపేట్ ఎస్సైగా హరిబాబు, భీంగల్ ఎస్సైగా మహేశ్, నిజామాబాద్ రూరల్ ఎస్సైగా మహ్మద్ ఆరిఫ్, ఆర్మూర్ ఎస్సై–1గా గంగాధర్, మహిళా పీఎస్ ఎస్సై–1గా సంజీవ్‌రావు, నిజామాబాద్ ఒకటో టౌన్ ఎస్సై–1గా విక్రం, ధర్పల్లి ఎస్సైగా రామకృష్ణ, మెండోరా ఎస్సైగా నారాయణ, బోధన్ టౌన్–2 ఎస్సైగా హబీబ్‌ఖాన్, నిజామాబాద్‌రూరల్ ఎస్సై–2గా బాపురావు, నిజామాబాద్ త్రీటౌన్ ఎస్సై–2గా నర్సయ్య, నిజామాబాద్ ఐదోటౌన్ ఎస్సై–2గా లక్ష్మణ్, డిచ్‌పల్లి ఎస్సై–2గా సత్యం, నిజామాబాద్ ఐదవటౌన్ ఎస్సై–2గా ఉదయ్ కుమార్, నిజామాబాద్ సీసీఎస్ ఎస్సై–2గా విఠల్ రావు, నిజామాబాద్ సీసీఆర్‌బీ ఎస్సైగా దేవకుమార్, నిజామాబాద్ ఎస్సై–2గా హన్మాండ్లు, నిజామాబాద్ సీసీఎస్ ఎస్సైగా చంద్రమోహన్, మోపాల్ ఎస్సై–2గా రజినీకాంత్, నిర్మల్ జిల్లా కుంటాల ఎస్సైగా భాస్కర్‌చారి, నిర్మల్ జిల్లా బజార్‌హత్నూర్ ఎస్సైగా అప్పారావు, ఏర్గట్ల ఎస్సైగా రాము, బోధన్ ఎస్సై–1గా మచ్చేందర్, బాల్కొండ ఎస్సైగా నరేశ్, నిజామాబాద్ ఒకటో టౌన్ ఎస్సై–2గా మహమ్మద్ షరీఫ్, నిజామాబాద్ త్రీటౌన్ ఎస్సై–1గా ఉడుత మహేశ్ బదిలీ కాగా రామరావు, పాండేరావులను నిజామాబాద్ వీఆర్‌కు పంపించారు.

### తపాలా సేవలను వినియోగించుకోవాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : గ్రామీణప్రాంత ప్రజలు తపాలా పథకాలపై అవగాహన పెంచుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని తపాలాశాఖ మెయిల్ ఓవర్సీస్(ఎంవో) మహబూబ్‌రెడ్డి సూచించారు. డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(డీసీడీపీ)లో భాగంగా నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద హైస్కూల్‌లో శుక్రవారం తపాలాశాఖ పథకాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నాగిరెడ్డిపేట ఎస్‌పీఎం(సబ్‌పోస్ట్ మాస్టర్) ఆసిఫ్‌అలీ, బీపీఎంలు నరేందర్, జాఫర్, విజయ్ తదితరులున్నారు.

### స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధమవ్వాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : త్వరలో జరుగనున్న స్థానికసంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సన్నద్ధమవ్వాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ సూచించారు. నాగిరెడ్డిపేట మండలంలోని ధర్మారెడ్డిలో కాంగ్రెస్ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామాల్లో క్షేత్రస్థాయిలోకి తీసుకువెళ్లాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి కిష్టయ్య, మాల్తుమ్మెద సొసైటీ మాజీచైర్మన్ రాంచందర్‌రెడ్డి తదితరులున్నారు.

## క్రైం కార్నర్

### ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

బాల్కొండ: ఆర్మూర్ మండలం కోటార్మూర్‌కు చెందిన ఓ వ్యక్తి కుటుంబ తగాదాలతో ఎస్సారెస్పీలోకి ఆత్మహత్య చేసుకోవడానికి వచ్చాడని ఫోన్‌లో సమాచారం అందుకున్న ముప్కాల్ పోలీసులు వెంటనే స్పందించి ఆయనను కాపాడారు. ముప్కాల్ మండల పరిధిలోకి వచ్చే లక్ష్మి కాలువ హెడ్‌రెగ్యులేటర్ వద్ద పట్టుకుని స్టేషన్‌కు తీసుకెళ్లారు. అనంతరం కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆత్మహత్యలు సమస్యకు పరిష్కారం కాదని.. క్షణికావేశంలో బలవన్మరణం చేసుకోవద్దని ఎస్సై భాస్కరాచారి పేర్కొన్నారు.

### చెట్ల పొదల్లో కొండ చిలువ



నవీపేట: మండల కేంద్రంలో శుక్రవారం చెట్ల పొదలను తొలగిస్తుండగా భారీ కొండ చిలువ లభ్యమైంది. పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోని చెట్ల పొదలను శుక్రవారం జేసీబీతో తొలగిస్తుండగా 12 అడుగుల కొండ చిలువ కనిపించింది. దీంతో దానికి కొద్ది భాగం గాయమవగా ఫారెస్ట్ అధికారులకు స్థానికులు సమాచారమిచ్చారు.

### చెరువులో మృతదేహం లభ్యం

రుద్రూర్: కోటగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాత పాతంగల్ చెరువులో గ్రామానికి చెందిన గోవూర్ గంగవ్వ (65)వృద్ధురాలి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహన్ని వెలికితీయించారు. మతిస్థిమితం లేని గంగవ్వ కాలకృత్యాలు తీర్చుకోడానికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయి ఉంటుందని భావిస్తున్నారు. మృతురాలి కుమారుడు గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ పేర్కొన్నారు.

### ఘర్షణ కేసులో ఇద్దరి రిమాండ్

కామారెడ్డి క్రైం: అన్నదమ్ముల కుటుంబాల మధ్య గతంలో జరిగిన ఓ ఘర్షణ కేసులో ఇద్దరి నిందితులకు కామారెడ్డి కోర్టు శుక్రవారం రిమాండ్ విధించింది. కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన రాజేశ్వర్‌రావు, ప్రవీణ్‌రావు 2019లో జరిగిన ఓ గొడవలో ఇద్దరిపై దాడి చేశారు. ఈ కేసు కోర్టులో కొనసాగుతోంది. నిందితులుగా ఉన్న ఇద్దరిని కోర్టు ఆదేశాల మేరకు దేవునిపల్లి పోలీసులు శుక్రవారం కోర్టుకు హాజరుపర్చగా కోర్టు రిమాండ్ విధించినట్లు ఎస్సై రాజు పేర్కొన్నారు.

## ఆటోను ఢీకొన్న ట్రాక్టర్

- ఒకరి మృతి, మరొకరికి గాయాలు

బాన్సువాడ రూరల్: ఆటోను ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలైన ఘటన మండలంలోని బుడిమి రోడ్డు సమీపంలో చోటు చేసుకుంది. సీఐ కృష్ణ శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. బాన్సువాడలో గురువారం వారాంతపు సంత కావడంతో దెగ్లూర్ నుంచి అబ్దుల్ హజీజ్(47), షేక్ రఫీఖ్ కలిసి ఆటోలో పండ్ల వ్యాపారం కోసం వచ్చారు. రాత్రి వ్యాపారం ముగించుకొని ఆటోలో బయలుదేరుతుండగా బుడిమి రోడ్డు సమీపంలో వెనుక నుంచి వచ్చిన ట్రాక్టర్ వేగంగా ఆటోను ఢీకొన్నది. ఈ ఘటనలో



ప్రమాదానికి గురైన ఆటో

ఆటో బోల్తా పడగా అబ్దుల్ హజీజ్ అక్కడికక్కడే మృతి చెందగా రఫీఖ్‌కు గాయాలయ్యాయి. మృతుడి కుమారుడు షేక్ ఆరీఫ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

### బావిలో జారిపడి ఒకరి మృతి

కామారెడ్డి క్రైం: కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో జారిపడి ఒ కరు మృతి చెందిన ఘటన కామారెడ్డి మండలం కొటాల్‌పల్లి శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. రాజంపేటకు చెందిన గడ్డమీది సత్తయ్య(58) గురువారం పొందుర్తిలో ఉండే తన చెల్లెలు ఇంటికి వెళ్లి వస్తానని కాలినడకన బయలు దేరాడు. కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా పొందుర్తికి రాలేదని చెప్పారు. దీంతో అతడి ఆచూకీ కోసం పలుచోట్ల గాలించారు. శుక్రవారం ఉదయం కొటాల్‌పల్లి వద్ద ఉన్న బావిలో మృతదేహం ఉందని సమాచారం రావడంతో వెళ్లి చూశారు. మృతుడిని సత్తయ్యగా గుర్తించారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. దేవునిపల్లి పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## కడుపు నొప్పి భరించలేక ఒకరి ఆత్మహత్య

బీబీపేట: కడుపు నొప్పి భరించలేక ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పంపరి భూదయ్య(60) వృత్తి రీత్యా కుల వృత్తి చేస్తున్నాడు. గురువారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతను బీబీపేట శివారులోని రాంరెడ్డిపల్లి రోడ్డులో పురుగుల మందు తాగాడు. అదే రోడ్డు గుండా వెళ్తున్న గ్రామానికి చెందిన నరేశ్ ఈ విషయాన్ని గమనించి కుటుంబీకులకు సమాచారం అందించాడు. దీంతో కుటుంబీకులు అక్కడికి చేరుకొని భూదయ్యను సిద్దిపేటకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. వారం రోజులుగా కడుపు నొప్పితో బాధపడడంతో పాటు మానసికస్థితి బాగాలేదన్న కోడలు లక్ష్మీప్రసన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

### ఇరువర్గాలపై కేసు నమోదు

బోధన్‌టౌన్: పట్టణంలోని శక్కర్‌నగర్ చౌరస్తాలో ఉన్న డాల్ఫిన్ హోటల్ వద్ద ఇరువర్గాలు ఒకరిపై ఒకరు శుక్రవారం దాడులు చేసుకున్నాయి. ఈ దాడిలో ముగ్గురిపై కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. రాకాసీపేట్‌కు చెందిన అన్సార్ అలీని శక్కర్‌నగర్‌కు చెందిన కౌన్సిలర్లు మీర్ నజీర్ అలీ, ఇమ్రాన్ మున్సిపల్ కార్యాలయం ఎదుట తమపై ఎందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నావంటు ప్రశ్నించారు. దీంతో వారి మధ్య మాటా మాటా పెరిగి వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో కౌన్సిలర్లు అన్సార్ అలీపై దాడి చేశారు. వీరు శక్కర్‌నగర్ చౌరస్తాలోని డాల్ఫిన్ హోటల్‌లో ఉండగా అన్సార్ తన సోదరులు, స్నేహితులతో వచ్చి మీర్‌నజీర్, ఇమ్రాన్‌లపై దాడికి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టారు. దీంతో ఇరువర్గాలు ఒకరిపై మరొకరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇరు వర్గాలకు చెందిన ఇమ్రాన్, మీర్‌నజీర్ అలీ, అన్సార్‌తో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వీరయ్య పేర్కొన్నారు.

## డ్రైవర్‌పై దాడి

- ఇన్నోవా వాహనం ఎత్తుకెళ్లిన దుండగులు

లింగంపేట: డ్రైవర్‌పై దాడి చేసి ఇన్నోవా వాహన, రెండు సెల్‌ఫోన్‌లను దుండగులు ఎత్తుకెళ్లిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గూడవల్లి స్టీవెన్ ఇన్నోవా వాహనం లీజుకు తీసుకొని హైదరాబాద్‌లో కిరాయి నడుపుతూ జీవిస్తున్నాడు. గురువారం రాత్రి లింగంపేట మండలం కన్నాపూర్‌కు చెందిన దారవోయిన శ్రీకాంత్ అతని భార్య, కుమారుడు కలిసి హైదరాబాద్‌లో స్టీవెన్ నడుపుతున్న ఇన్నోవా వాహనాన్ని కిరాయికి మాట్లాడుకొని లింగంపేట మండలం కన్నాపూర్‌కు వస్తున్నారు. రాత్రి ఒంటిగంటకు కన్నాపూర్ సమీపంలోకి వచ్చిన తర్వాత అటవీ ప్రాంతంలో కాలకృత్యాల కోసం వాహనాన్ని ఆపమని చెప్పగా డ్రైవర్ స్టీవెన్ వాహనాన్ని పక్కన నిలిపివేశాడు. శ్రీకాంత్ అతని భార్య ఇద్దరు కలిసి డ్రైవర్‌పై దాడి చేసి చున్నీతో మెడకు బిగించి చంపడానికి యత్నించారు.

దీంతో డ్రైవర్ స్పృహతప్పి పడిపోయాడు. అతని దగ్గర ఉన్న రెండు సెల్‌ఫోన్లు, ఇన్నోవా కారును తీసుకొని పారిపోయారు. డ్రైవర్ స్పృహ నుంచి కోలుకొని శుక్రవారం లింగంపేట పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.